తాటి.. రుచిలో మేటి

- నోరూరిస్తున్న తాటి వంటకాలు
- పెనుగొండ-నరసాపురం రహదారిలో అమ్మకాలు


పెనుగొండ-నరసాపురం రహదారిలో రోడ్డు పక్కన వెలిసిన తాటి వంటకాల దుకాణాలు

పెనుగొండ: పిజ్జా, బర్గర్లు, నూడిల్స్‌పై మోజు పెంచుకున్న యువత ఇప్పుడు సంప్రదాయ వంటకాల వైపు మళ్లుతున్నారు. కనుమరుగైపోతున్న సంప్రదాయ పిండి వంటలు నెమ్మదిగా ఆదరణకు నోచుకొంటుండడంతో ఆంధ్రా పిండి వంటలు ప్రతి ప్రాంతంలోనూ అందుబాటులోకి వస్తున్నాయి. ఈ కోవలోనే గతంలో కేవలం గ్రామీణ ప్రాంతాలకే పరిమితమైన తాటికాయలతో వంటకాలు అమ్మకాలకు సిద్ధమై నోరూరిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ఆదరణ ఉన్న తాటి పండ్ల నుంచి వచ్చే గారెలు, తాటి రొట్టెలు రోడ్డు సైడు అమ్మకాలతో ఆదరణ పొందుతున్నాయి. కేవలం పల్లె ఇళ్లల్లో తెల్లవారు జామునే తాటి చెట్ల వద్దకు వెళ్లి చిన్నారులు చెట్టు నుంచి రాలిపోయిన తాటి పండ్లను తెచ్చుకుని టెంకలు చీకడం, వాటితో టెంక నుంచి తీసిన తాటి పెసంతో తాటి గారెలు, తాటి రొట్టెలు వేసుకుని తినడం జరిగేది. కాలక్రమేణా తాటి వంటకాలు కనుమరుగయ్యాయి.

జోరుగా అమ్మకాలు

గత ఏడాది కాలంగా తాటి వంటకాలు పునః ప్రారంభమయ్యాయి. గతంలో ఇళ్లకే పరిమితమైన తాటి వంటకాలు రోడ్డుపైకి అమ్మకానికి చేరుకున్నాయి. పెనుగొండ-నరసాపురం రహదారిలో రోడ్డు పక్కన అమ్మకానికి దుకాణాలు ప్రారంభమయ్యాయి. తాటి వంటకాలు ప్రయత్నం చేద్దామంటూ ఏర్పాటు చేసిన దుకాణాలు ఆదరణకు నోచుకోవడంతో వాటి మధ్య పోటీ ప్రారంభమై ఒకటికి రెండు రోడ్డు పక్కన వెలుస్తున్నాయి. పల్లెల నుంచి తాటి పండ్లు తెచ్చి తాటిపండు ప్రియుల వద్దనే ఒలిచి పెసుం తీసి గారేలు, తాటి రొట్టెలు మరీ వండి మరీ ఇస్తుండడంతో వాటిని కొనుగోలు చేయడానికి వాహనదారులు బారులు తీరుతున్నారు. వీటిని కట్టెల పొయ్యి మీద, బొగ్గుల పొయ్యిల మీద మరీ తయారు చేస్తుండడంతో మరింత ఆసక్తి చూపుతున్నారు. రోడ్డుపక్కనే నోరూరిస్తుండడంతో అక్కడే రుచి చూసి మరీ కొనుగోలు చేస్తున్నారు. 10 గారెలు రూ.100, రొట్టె రూ.100కు అమ్మకాలు సాగిస్తున్నారు. కేవలం ఇద్దరు పనివాళ్లతోనే వ్యాపారం ముందుకు సాగుతుండడంతో లాభదాయకంగా ఉండడంతో దుకాణాల సంఖ్య కూడా క్రమేపి పెరుగుతుంది.


నోరూరిస్తున్న తాటి గారెలు


తాటి రొట్టెలు

తాటి పండుతో లాభాలెన్నో..!

తాటి పండుతో ఆరోగ్యానికి లాభాలు ఎక్కువగానే ఉండడంతో రోజురోజుకూ ఆసక్తి పెరుగుతోంది. తాటి పండులో ఏబీసీ విటమిన్‌లు, జింక్, పొటాషియం, ఐరన్, కాల్షియం, ఫాస్ఫరస్ వంటివి అధికంగానే ఉంటాయి. దీంతో మలబద్ధకం సమస్య తగ్గి, జీర్ణ వ్యవస్థ మెరుగవుతుంది. యాంటీఆక్సిడెంట్స్ అధికంగా ఉండడంతో క్యాన్సర్ నివారణకు తోడ్పాటుగా ఉంటుంది. కాల్షియం, ఫాస్ఫరస్ ఉండడంతో ఎముకలు, దంత పుష్టి పెరుగుతుంది. దగ్గు, జలుబు ఇబ్బందులకు ఉపశమనం కలుగుతుందని గ్రామీణులు ఆహారంగా తీసుకుంటారు.

దేవీ శరన్నవరాత్రుల ఏర్పాట్లకు శ్రీకారం


దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల రాట ముహూర్తంలో పాల్గొన్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల కోసం ఉత్సవ కమిటీ సభ్యులు రాట ముహూర్తాలు చేస్తున్నారు. స్థానిక అచ్చుగట్లపాలెం యినకొండవారి వీధిలో దేవిశ్రన్నవరాత్రుల ఉత్సవాలు కోసం ఆదివారం పందిరి రాట ముహూర్తం చేశారు. ఈ నెల 22 నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలకు ఏర్పాట్లు చేయనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు, యువకులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్డీఓ దాసి రాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులు ఉదయం 10.30 గంటలు నుంచి అందించాలని కోరారు.

క్లుప్తంగా

బాధితుడికి ఆర్థిక సాయం


బాధితుడికి సహాయం అందిస్తున్న వసుధ ఫౌండేషన్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని చింతపర్రు గ్రామానికి చెందిన అంగర వెంకటేశ్వరరావు బ్రెయిన్ స్ట్రోక్‌తో, అలాగే చింతపర్రు గ్రామానికి చెందిన బొర్రా శ్రీను పెరాలసిస్‌తో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న వసుధ పౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు ఆర్థిక సహాయం అందజేశారు. ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్దరాజు ఆదివారం బాధితుల ఇంటికి వెళ్లి వెంకటేశ్వరరావుకు రూ. 15 వేలు, శ్రీనుకు రూ. 10 వేలు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఫౌండేషన్ చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

రమణకుమార్‌కు ఉత్తమ అధ్యాపక అవార్డు


పురస్కారం అందుకుంటున్న రమణకుమార్

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల హిందీ అధ్యాపకుడిగా పని చేస్తున్న ఏఎస్ఎస్ రమణకుమార్ రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డును అందుకున్నారు. ఆదివారం గుంటూరులో ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య అందించిన ఈ పురస్కారాన్ని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, తిరుపతి వైస్ ఛాన్సలర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి చేతులమీదుగా అందుకున్నారు. రమణకుమార్ మాట్లాడుతూ గత ముప్పై ఏళ్లుగా హిందీ అధ్యా పకుడిగా పనిచేస్తున్న తన సేవలను గుర్తించి ఈ పురస్కారం అందివ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు. బ్రాహ్మణ సేవా సంఘ సభ్యులు నందుల దశరథ్, సోమంచి శాస్త్రి, వైఎస్ఆర్, సిహెచ్ నర సింహమూర్తి, జి వెంకటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ వికే మల్లేశ్వరరావు తదితరులు రమణకుమార్‌కు అభినందనలు తెలియజేశారు.

నిలిచిన గ్రంథాలయ నిర్మాణ పనులు

- రూ 1.18 కోట్లతో నిర్మాణం మొదలుపెట్టిన గత ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వంలో నిలిచిన పనులు


కాటన్‌పార్కు వద్ద నిలిచిపోయిన గ్రంథాలయ నిర్మాణ పనులు

నరసాపురం: స్థానిక కాటన్‌పార్కు వద్ద చేపట్టిన గ్రంథాలయ నూతన భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. దీంతో శాఖా గ్రంథాలయానికి సొంతభవనం సమకూర్చాలన్న లక్ష్యం నెరవేరేలా కనిపించడంలేదు. 2023 జనవరిలో గ్రంథాలయ నిర్మాణానికి గత జగన్ ప్రభుత్వం జిల్లా గ్రంథాలయ అభివృద్ధి సంస్థ ద్వారా 1.28 కోట్లు మంజూరు చేసింది. దీంతో అదే ఏడాది ఏప్రిల్‌లో పనులు ప్రారంభించారు. మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు సూచన మేరకు రైల్వే స్టేషన్ రోడ్డులోని కాటన్ పార్కు వద్ద 25 సెంట్లు మున్సిపల్ స్థలాన్ని గ్రంథాలయం కోసం కేటాయించారు. దీంతో ఎన్నో ఏళ్ల చరిత్ర ఉన్న నరసాపురం గ్రంథాలయానికి సొంత భవనం ఏర్పాటు కాబోతోందని అందరూ భావించారు. ప్రభుత్వం మారిన తరువాత పనులు అర్థాంతరంగా నిలుపుదల చేశారు. 1954లో నరసాపురంలో గ్రంథాలయం స్థాపించారు. ప్రస్తుతం గ్రేడ్-1 గ్రంథాలయంగా కొనసాగుతోంది. ఇప్పటికీ ఈ గ్రంథాలయానికి ప్రతిరోజూ 200 మంది వరకూ రీడర్స్ వస్తారు. అయితే భవనమే అసలు సమస్య. అద్దె భవనంలో అరకొర వసతుల మధ్య గ్రంథాలయంలో సేవలు కొనసాగుతున్నాయి. ఇరుకు గదుల్లో, ఆరు బయట పుస్తకాలు చదవాల్సిన పరిస్థితి.


అద్దె భవనంలో ఉన్న నరసాపురం శాఖా గ్రంథాలయం

సమస్య మళ్లీ మొదటికి

సొంత భవనం సమకూరుతుందనుకుంటే సమస్య మళ్లీ మొదటికి వచ్చినట్లయ్యింది. గతంలో కూడా టీడీపీ హయాంలో నిధులు అందుబాటులో ఉన్నా కూడా కనీసం స్థల సేకరణపై కూడా దృష్టి పెట్టని దారుణ పరిస్థితి. దాదాపు 70 ఏళ్ల సమస్యకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పరిష్కారం చూపించిందని అనుకుంటే, కూటమి ప్రభుత్వం అలసత్వం కారణంగా సమస్య మొదటికి వచ్చినట్లయ్యింది.

ఇలపర్రు వైఎస్సార్ సీపీ కమిటీ నియామకం


ఇలపర్రు వైఎస్సార్ సీపీ నూతన గ్రామ కమిటీ

పెనుగొండ: మండలంలోని ఇలపర్రు వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడిగా పులిదిండి మోహనరావు నియమితులయ్యారు. ఆదివారం సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షురాలు దండు పద్మావతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశాలతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా బొక్కా సుబ్రహ్మణ్యం, యూత్ అధ్యక్షుడిగా నక్కా పాల్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా దిడ్ల శ్రీను, బీసీ సెల్ అధ్యక్షుడిగా చిన్ని శ్రీను, రైతు విభాగం అధ్యక్షుడిగా కట్టా ఏడుకొండలు, మహిళా అధ్యక్షురాలుగా కొచ్చర్లపాటి కుమారిలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వరరావు, వేంద్ర వెంకటేశ్వర్లు, సాదే గోపాలం, కోలాటి శ్రీరామ్ మూర్తిచ కటికతల మోహనరావు, గుణపాటి సంజీవరావు, దిడ్ల వెంకట్రావు, పీతల ప్రభాకర్ పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మెషీన్ల పంపిణీ


కొప్పర్రులో కుట్టు మెషీన్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: రాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన కుట్టు మెషీన్ల పంపిణీ మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతుందని మున్సిపల్ చైర్ పర్సన్ బర్రే శ్రీ వెంకటరమణ, ఎంపీపీ మైలాబత్తుల సోనీ అన్నారు. ఆదివారం మండలంలోని కొప్పర్రు పెద్దపేటలో నిర్వహించిన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. సర్పంచ్ నల్లి వరలక్ష్మి జేమ్స్ అధ్యక్షతన నిర్వహించిన సభలో వక్తలు మాట్లాడుతూ రాజ్ ట్రస్ట్ సేవలను కొనియాడారు. ట్రస్టు నిర్వాహకులు గంటా రాజ్ కుమార్, గంట సుందర్‌కుమార్ లు మాట్లాడుతూ తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొప్పరులో 23 మంది మహిళలకు కుట్టు మెషీన్లు పంపిణీ చేశామన్నారు. న్యాయవాది జాన్ కెనడి, నరసాపురం బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బూసి విశ్వేశ్వరరావు, వెన్న ప్రకాష్, ఉపాధ్యక్షుడు వైదాని నాగేశ్వరరావు, కోశాధికారి పూరిళ్ళ శ్రీనివాస్, న్యాయవాదులు పోలిశెట్టి బాబ్జి, శ్రీ రఘురామారావు తదితరులు పాల్గొన్నారు.

17న స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్


డీఎంహెచ్ వో గీతాభాయి

భీమవరం (ప్రకాశంచౌక్): మెరుగైన ఆరోగ్య సంరక్షణ సేవల ద్వారా మహిళలు, పిల్లలకు సాధికారత కల్పించే లక్ష్యంతో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌ను దేశవ్యాప్తంగా ఈనెల 17వ తేదీన ప్రారంభించనున్నారని డీఎంహెచ్‌వో గీతాభాయి తెలిపారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా మొత్తం 471 ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు, ఈ శిబిరాల్లో ప్రత్యేకంగా మహిళలు, పిల్లలకు విస్తృత వైద్య సేవలను అందిస్తామన్నారు. ప్రసూతి, కంటి పరీక్షలు, ఈఎన్‌టీ, దంత, చర్మవ్యాధి, మధుమేహం, రక్తపోటు, కేన్సర్లు, టీబీ, ఎనీమియా, సికిల్ సెల్ వ్యాధి స్క్రీనింగ్, గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు, పోషణ సలహాలు, రక్తదాన కార్యక్రమాలు, పౌష్టికాహార అవగాహన, వయో వందన కార్డుల నమోదులు జరుగుతాయన్నారు, ప్రోగ్రాం ఆఫీసర్ కేఎంఆర్ కిషోర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఆరోగ్యవంతమైన కుటుంబాలు, శక్తివంతమైన సమాజాల నిర్మాణమే ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు.

ఉత్సాహంగా గణేష్ నిమజ్జనోత్సవం

పాలకోడేరు: విస్సాకోడేరులో ఆదివారం గణేష్ నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. వివిధ వేషధారణలు, మేళ తాళాల నడుమ స్వామివారి ఊరేగింపు వైభవంగా నిర్వహించి అనంతరం నిమజ్జనం జరిపారు. గణేషుడికి నైవేద్యంగా సమర్పించిన లడ్డూ ప్రసాదాన్ని కునుకు దుర్గారావు రూ.72 వేలకు వేలంలో దక్కించుకున్నారు. పాలకొల్లు, భీమవరం రహదారిలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా పోలీసులు బందోబస్తు నిర్వహించి ట్రాఫిక్‌ను మళ్లించారు.

చెస్ విజేతలకు బహుమతుల అందజేత


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: స్థానిక వన్ టౌన్‌లో ఆదివారం నిర్వహించిన ఇన్విటేషనల్ ఓపెన్ ర్యాపిడ్ చెస్ టోర్నీలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. టోర్నీ నిర్వాహకుడు, జిల్లా చదరంగం అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.కిషోర్ మాట్లాడుతూ ఆరు గ్రూపుల్లోని విజేతలకు రూ.20 వేల విలువైన బహుమతులు అందించినట్టు చెప్పారు.

తండ్రి అదృశ్యంపై ఫిర్యాదు

తాడేపల్లిగూడెం రూరల్: తండ్రి కనిపించడం లేదంటూ కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్సై జేవీఎన్ ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం పెదతాడేపల్లి గ్రామానికి చెందిన పసుమర్తి నాగేశ్వరరావు (50) ఈ నెల 13న ఉదయం కూలీ పనికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. బంధువుల ఇళ్ల వద్ద గాలించినా ఆచూకీ కానరాలేదు. దీంతో అతడి కుమారుడు పసుమర్తి కుమార్ అవినాష్ పోలీసులను ఆశ్రయించాడు.

రోడ్డు కోసం రిలే దీక్షలు


వెంప రోడ్డు కోసం రిలే దీక్షలు చేస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: మొగల్తూరు మండలం వెంప-మొగల్తూరు రహదారి నిర్మాణ పనులు వెంటనే చేపట్టాని కోరుతూ అఖిలపక్షం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి ఆరో రోజుకు చేరాయి. ఈ సందర్భంఐక్యవేదిక కన్వీనర్ యడ్ల చిట్టిబాబు మాట్లాడుతూ వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టకపోతే ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ దీక్షల్లో బంగారు వెంకట సీతారామయ్య, అడ్డాల ఏడుకొండలు, కుందేటి వెంకటేశ్వరరావు, వాముశెట్టి బోసుబాబు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

యలమంచిలి: మండలంలోని గుంపర్రు పంచాయతీ కడిమిపుంతలో ఇరువర్గాల మధ్య సరిహద్దు వివాదం కారణంగా ఘర్షణ చెలరేగింది. ఈ నేపథ్యంలో ఇరు వర్గాల వారు ఒకరిపై ఒకరు కేసు పెట్టడంతో ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.గుర్రయ్య తెలిపారు.

జూదరుల అరెస్ట్

భీమవరం: వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 12వ వార్డులో పేకాడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై బీవై కిరణ్ కుమార్ తెలిపారు. నిందితుల నుంచి రూ.2,930 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

ఉండి బస్టాండు.. ఇబ్బందులు మెండు


ఉండి బస్టాండ్‌లో వేసిన కంకరు మట్టి (గ్రావెల్) రోడ్డు

ఉండి: ప్రయాణికులపై ఆర్టీసీ అధికారులకున్న ప్రేమ ఏంటో ఉండి బస్టాండ్‌ను చూస్తే అర్థం అవుతోంది. కనీసం బస్టాండ్‌లోకి వెళ్లే మార్గం కూడా సరిగా లేకపోవడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. గత కొంతకాలంగా ఉండి బస్టాండ్ దుస్థితిపై మీడియాలో కథనాలు రావడంతో ఆర్టీసీ అధికారులు స్పందించి ఉండి బస్టాండ్‌లో రోడ్డు వేశారు. కానీ కేవలం గ్రావెల్ (కంకరు మట్టి) రోడ్డు వేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆ కంకరు రోడ్డు కాస్త బురదమయంగా మారండంతో ప్రయాణికులు బస్టాండ్ లోపలికి వెళ్లాలన్నా, బయటకు రావాలన్నా నానా ఇబ్బందులు పడుతున్నారు. ఉండి జంక్షన్‌లో ప్రతిరోజు సుమారు వందపైనే బస్సు సర్వీసులు రాకపోకలు సాగిస్తుంటాయి. అటువంటి బస్టాండ్‌లో మౌలిక సదుపాయాలు లేకపోగా కనీసం బస్టాండ్‌లోకి వెళ్లే రోడ్డు కూడా అధ్వానంగా ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.